
సాక్షి వైఎస్సార్ జిల్లా



ప్రజల గుండెలలో పెద్దాయన

ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ అందరినీ ఏకతాటిపై నడిపించిన దివంగత వైఎస్ రాజారెడ్డి పులివెందుల పెద్దాయనగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. - 8లో



నందబాలుడి ఆనంద విహారం

వగలంతా భక్తుల మొర విని వారి సమస్యలను తీర్చిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుడు సాయంత్రం తెప్పపై జలవిహారం చేస్తూ సేద తీరాడు. -8లో

గరిష్టం/కనిష్టం
38.4/27.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.5 – 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు పంచాయతీరాజ్ ఇంజనీర్ల జోనల్ వర్క్‌షాప్

కడప సెవెన్‌రోడ్స్: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన జోనల్ వర్క్‌షాప్ గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తమ శాఖలో జరుగుతున్న కార్యక్రమాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చ నడుస్తుందని పేర్కొన్నారు. వివిధ పనులకు సంబంధించిన అంచనా వ్యయాలు తయారు చేయడం, ఆమోదం పొందడం, చెల్లింపులు, క్వాలిటీ కంట్రోల్, ఆన్‌లైన్ విధానం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. రాయలసీమ జోన్–4లో ఉన్న ఇంజనీర్లు హాజరవుతారన్నారు. రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

రేపటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ సప్లమెంటరీ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని వివరించారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని డీఈఓ తెలిపారు.

26న జిల్లాస్థాయి అండర్-16 క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 26వ తేదీ ఉదయం 7 గంటలకు జిల్లాస్థాయి బాలుర అండర్-16 క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. 01-09-2008 నుంచి 31-08-2010 మధ్యలో పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో, స్టడీసర్టిఫికెట్‌లు, కిట్ బ్యాగ్ తీసుకురావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దౌలత్‌ఖాన్ తెలిపారు. డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరేందుకు ఇంటర్ లేక తత్సమానమైన కోర్సులో ఓసీలు 50 శాతం, బీసీ,ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేసినవారు చెవిటి, మూగ(బధిర) బాలబాలికల ప్రత్యేక పాఠశాలలు, ఇన్‌క్లూజివ్ స్కూల్స్(సాధారణ పాఠశాలలు), భవితా కేంద్రాలలో ఐఈఆర్టీ ఉపాధ్యాయులు అయ్యేందుకు అర్హులని తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు జూన్ 14లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు నగర శివార్లలోని రామాంజనేయపురం సెంట్రల్ జైలు వద్ద ఉన్న హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో లభిస్తాయని ప్రిన్సిపాల్ దౌలత్‌ఖాన్ తెలిపారు. వివరాలకు 9849311680, 9966006758 నెంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఊటీకి జూన్ 7న ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఊటీకి జూన్ 7న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 7న రాత్రి మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి మైసూర్‌లోని పలు ప్రదేశాలు చూసుకుని రాత్రి తిరిగి మదనపల్లెకు బయలుదేరి ఉదయం చేరుకుంటుందన్నారు. రాను,పోను చార్జీ రూ.2800 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కావాల్సినవారు 7382875034, 7382876658ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలు గురువారం నుంచి రెండురోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్సవాల ఏర్పాట్లు చేసింది. తాళ్లపాక, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం ప్రదేశం (అన్నమయ్య ఉద్యానవనం), సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టుల కళాకారులచే భక్త సంగీత, నృత్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తాళ్లపాక అన్నమాచార్య ధ్యానమందిరం ఆవరణంలో శ్రీవారి కల్యాణం టీటీడీ నిర్వహిస్తోంది. ఉదయ 10 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నమయ్య వారసులను ఘనంగా సత్కరించనున్నారు.

ఉజ్వల భవితకు సోపానం

పదో తరగతి తర్వాత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'పాలిటెక్నిక్ విద్య' సోపానంగా నిలుస్తోంది. ప్రస్తుతం చెంతనే ఉన్న సాంకేతిక విద్య ఉర్దూ విద్యార్థులకు ఒక వరంగా మారింది. అవును.. 'మను' రూపంలో ముంగిటే కొలువై ఉంది. దరఖాస్తుల ఆహ్వానం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏపీలో ఏకైక పాలిటెక్నిక్ 'మను'
- నాలుగు బ్రాంచుల్లో ఏటా 240 సీట్లు కేటాయింపు
- భారతదేశంలోని 29 రాష్ట్రాల విద్యార్థులకు అవకాశం
- ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



కడప రిమ్స్ వద్ద ఏర్పాటు చేసిన మను పాలిటెక్నిక్

కడప ఎడ్యుకేషన్: మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మను) అనుబంధ సంస్థ మను పాలిటెక్నిక్ జిల్లా విద్యార్థులకు అందుబాటులో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని కడప రిమ్స్ వద్ద 10.15 ఎకరాల స్థలాన్ని కేటాయించి యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్, మినిస్ట్రియల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి ఆర్థిక సహాయంతో రూ. 20 కోట్లతో నూతన భవనాలను నిర్మించింది. దీంతోపాటు మరో రూ.5 కోట్లతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్, ఫిజిక్స్ ల్యాబ్, లైబ్రరీ వంటివి ఏర్పాటు చేశారు. అలాగే కళాశాల ఆవరణం మొత్తం ప్రహరీని ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా బీహార్‌లోని దర్బాంగ్, ఒరిస్సాలోని కటక్, కర్నాటకలోని బెంగులూరు, తెలంగాణలోని హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో మాత్రమే ఈ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి.

ప్రవేశానికి అర్హులెవరంటే...

ఈ మను పాలిటెక్నిక్‌లో అన్ని కేటగిరీలకు చెందిన విద్యార్థులు చేరవచ్చు. ఏ కేటగిరీకి చెందిన వారైనా సరే పదవ తరగతిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో చదువుతున్నా సరే లాంగ్వేజికి సంబంధించి మాత్రం ఉర్దూ సబ్జెక్టు లేదా ఉర్దూ మీడియంలో చదివే వారికి మాత్రమే ఇందులో ప్రవేశానిక అర్హులు. ఇందులో చేరాలనుకునే వారు ఖచ్చితంగా ప్రవేశ పరీక్షను రాసి ర్యాంకును సాధించాలి. అలా ర్యాంకులు సాధించిన వారికి కేటగిరిల (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఫిజికల్ హ్యాండీక్యాప్, ఉమెన్ కో టా) వారీగా రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం సీట్లను కేటాయిస్తారు. ఇందులో ఏయే రాష్ట్రాల అభ్యర్థులకు ఎక్కడెక్కడ సౌలభ్యంగా ఉంటుందో అక్కడే చేరవచ్చు. ఇందులో చేరే వారిలో ఆడపిల్లలకైతే మూడేళ్లకు 13,100 రూపాయలు, మగపిల్లలకైతే మూడేళ్లకు 14,700 రూపాయిలు, వికలాంగ విద్యార్థులకైతే మూడేళ్లకు 5100 రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇందులో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్‌తోపాటు నేషనల్ స్కాలర్‌షిప్స్ వంటికి కూడా పొందవచ్చు. ప్రస్తుతం ఈ పాల్‌టెక్నిక్‌లో ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, బెంగాల్, తెలంగాణా రాష్ట్రాలతోపాటు ఏపీకి చెందిన పలువురు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దీంతోపాటు ఇక్కడ చదువుకునే విద్యార్థులకు బయట ప్రాంతంలో ఉండే మైనార్టీ హాస్టల్‌లో చేరేందుకు అవకాశం ఉందని కళాశాల యాజమాన్యం తెలిపింది.

మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

మను పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి మే 30 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష జూన్ 12వ తేదీ కడప సమీపంలోని రిమ్స్ వద్ద ఉన్న మను పాలిటెక్నిక్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుంది. ఇందులో ప్రవేశ పరీక్షకు ఆడపిల్లలకు రూ. 350, మగపిల్లలకు రూ.550లు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల బట్టి రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయంటే..

మను పాలిటెక్నిక్‌లో నాలుగు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ అప్పరల్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. ఇందులో ప్రతి కోర్సుకు 60 సీట్ల చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, సెంట్రల్ లైబ్రరీలతోపాటు అన్ని కోర్సులకు సంబంధించి వర్క్‌షాపులు ఉన్నాయి.



మను పాలిటెక్నిక్‌లో ఫిజిక్స్ ల్యాబ్

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కడపలో ఏర్పాటు చేసిన మను పాలిటెక్నిక్‌ను జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్, డిప్లమా ఇన్ ఆప్పరెల్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. ఈ మూడు కోర్సులకు సంబంధించి 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. – డాక్టర్ ఎండీ అబ్దుల్ ముక్సిత్ ఖాన్, ప్రిన్సిపల్, మను పాలిటెక్నిక్, కడప

పాఠ్య పుస్తకాల తరలింపు



పాఠ్యపుస్తకాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనూరాధ

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలను అందచేస్తామని డీఈఓ మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప పాఠ్య పుస్తకాల గోడౌన్ నుంచి మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాల తరలింపు కార్యక్రమాన్ని టెక్స్‌బుక్స్ మేనేజర్ అంజనాదేవి ఆధ్వర్యంలో డీఈఓ మర్రెడ్డి అనూరాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా పుస్తకాలు తరలించే ఆర్టీసీ డీజీటి వాహనాన్ని డీఈఓ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి రోజు వైఎస్సార్ జిల్లాలో గోపవరం, బికోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బిమఠం మండాలకు సంబంధించిన 38842 పుస్తకాలను, అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలకు సంబంధించి 30,924 పాఠ్యపుస్తకాలను ఆయా మండల కేంద్రాల ఎమ్మార్సీలకు తరలించారు. ఈ సందర్భంగా డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 12,57,465 పాఠ్యపుస్తకాలు అవసరంగా కాగా ఇప్పటి వరకు కడపలోని పుస్తక గోడౌన్‌కు 5,70,953 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ఇంకా 6,86,512 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం గోడౌన్‌కు వచ్చిన పుస్తకాలను ఆయా మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు వాహనాల ద్వారా తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తక గోడౌన్ మేనేజర్ అంజనాదేవి, సిబ్బంది డేవిడ్, నాగయ్య, నరేష్, ఆర్టీసీ ఏటీఎం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల సంరక్షణకు చర్యలు



బి.కొత్తకోట మండలం గట్టు కొండపై శిథిలమైన రంగనాథస్వామి ఆలయం

బి.కొత్తకోట: ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో పురావస్తుశాఖ పరిధిలోని ఆలయాలను సంరక్షించి, వాటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలం గట్టు సమీపంలోని కొండపై వెలసిన రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణ తాత్కాలిక పనుల కోసం రూ.25 లక్షలు మంజూరు చేయాలని పురావస్తుశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఆలయ మండపం శిథిలావస్థలో ఉంది. దీని స్తంభాలకు మరమ్మతులు చేసి సిద్ధం చేసేందుకు నిర్ణయించారు. ఈ ఆలయం గుప్త నిధుల ముఠాల దెబ్బకు పూర్తిగా శిథిలమై ధ్వంసమైంది. మూలవిరాట్‌ను గట్టులోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ సంరక్షణ కోసం అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలో సాంకేతిక అధికారుల బృందం ఈ ఆలయాన్ని సందర్శించి పునరుద్ధరణ కోసం చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించనుంది. కాగా అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాల్లోని ఆలయాల్లో వాటి చరిత్రను తెలిపే శిలాశాసనాలు ఉన్నాయని, వాటిని నిర్లక్ష్యం చేసి ఎక్కడపడితే అక్కడ వదిలేయొద్దంటూ పురావస్తుశాఖ తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ జిల్లాల దేవదాయశాఖ అధికారులకు లేఖలు రాశారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శిలాశాసనాలను ప్రదర్శన శాలలో ఉంచేందుకు అప్పగించాలని కోరినా గ్రామస్తుల నుంచి నిరాకరణ ఎదురవుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆలయ చరిత్రను తెలిపే శాసనాలను సంరక్షించి ఆలయంలో ఓ చోట భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని లేఖలో ఆయన కోరారు. దీనిపై దేవదాయశాఖ అధికారులు ఆయా జిల్లాలోని ఆలయాల నిర్వాహకులకు లేఖలు పంపి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలో బి.కొత్తకోట మండలంలోని గట్టు రంగనాథస్వామి, మదనపల్లెలోని జిడ్డు కృష్ణమూర్తి గృహం, కలికిరిలోని ఎల్లమ్మ ఆలయం, ఓబులవారిపల్లె మండలంలోని ఎర్రగుంట్లకోట, నందలూరు మండలంలోని పొత్తపి మూలస్థానేశ్వర ఆలయం, అడపూర్‌లోని చారిత్రక బౌద్ధ ఆరామాలు, రాజంపేట మండలం తాళ్లపాకలోని పాతిగడ్డ, పెనగలూరు మండలంలోని కామాక్షి సమేత నాగేశ్వరస్వామి ఆలయం, చిన్నండెం మండలం జల్లావారిపల్లెలోని మండెం లక్ష్మి నరసింహస్వామి ఆలయం కళాఖండాలు, చారిత్రక ప్రాశస్త్యం కలిగినవని తెలిపారు. వీటిలో రెండు ఆలయాలు మినహాయిస్తే మిగిలినవి తమ ఆధీనంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆలయాల్లోని చారిత్రక ఆధారాలను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

'ఓట్ల లెక్కింపు'వద్ద పకడ్బందీ ఏర్పాట్లు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్. విజయారావు

కడప అర్బన్: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనీ కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తెలియజేశారు. బుధవారం ఆయన తమ పరిధిలోని కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన పకడ్బందీ ఏర్పాట్లపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. సమస్యాత్మక ప్రాంతాపై నిఘా ఉంచాలని.. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద కేవలం ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్‌ను, డీజిల్‌ను బాటిల్స్, క్యాన్‌లలో అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మే 30వ తేదీ నుంచి ప్రతి జిల్లాల సరిహద్దు ప్రవేశం, నిష్క్రమణల దగ్గర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, పోలీస్ అధికారులకు, ఆయా సిబ్బందికి బందోబస్తు ప్రణాళికపై చర్యలు తీసుకుని బ్రీఫింగ్ చేయాలన్నారు.

- ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయాలన్నారు. నైట్ పెట్రోలింగ్ చురుగ్గా చేయాలని, పోలీస్ కంట్రోల్ రూమ్స్ యాక్టివేట్ కావాలని అధికారులకు సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నమయ్య జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, వైఎస్ఆర్ జిల్లా నుంచి అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్ పాల్గొన్నారు.

బి.మఠం బాలుర హైస్కూల్లో ఇంటర్ కళాశాల

బ్రహ్మంగారిమఠం: 2024–2025 సంవత్సరానికి వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఇంటర్మీడియట్ కో–ఎడ్యుకేషన్ కళాశాల ప్రారంభిస్తున్నట్లు హెడ్‌మాస్టర్ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులు మాత్రమే ఉంటాయన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఉన్నత పాఠశాలకు వచ్చి పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు.

ఎన్నాళ్లీ ప్రత్యేక బాదుడు!

- ఐదేళ్ల నుంచి వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు
- 30 శాతం అదనపు వ్యయం
- ప్రయాణికులపై ఆర్థిక భారం



జిల్లామీదుగా నడిచే ప్రత్యేక రైలు

రాజంపేట: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న ప్రత్యేక రైళ్లలో ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు లేకపోయినా ప్రత్యేక బాదుడు మాత్రం కొనసాగుతోంది. సాధారణంగా ప్రయాణికుల డిమాండ్, రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలపై అధ్యయనం చేసి రెగ్యులర్ రైళ్లను అందుబాటులోకి తేవాల్సిన రైల్వేశాఖ అందుకు విరుద్ధంగా ఏళ్ల తరబడి 'ప్రత్యేకం' పేరుతో నడుపుతున్న రైళ్లు ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలో రెండు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రాలైన కడప, రాజంపేటలో రైల్వే స్టేషన్లు ఉన్నాయి. అలాగే ప్రాధాన్యత కలిగిన నందలూరు, ఎర్రగుంట్ల రైల్వే కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కడప, ప్రొద్దుటూరుతోపాటు రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల నుంచి వ్యాపార రీత్యా ప్రధాన గరాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి సికింద్రాబాద్, హైదరాబాద్, షిర్డీ, ముంబయి, చెన్నైకి అదనంగా రెగ్యులర్ రైళ్లను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అదనపు చార్జీలు చెల్లించినా..

అదనపు చార్జీలు చెల్లించి ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణం చేసినప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి అదనపు ప్రయోజనాలు లభించడం లేదు. పైగా గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు సకాలంలో గమ్యాలకు చేరుకోలేక పోతున్నారు. పండుగలు, సెలవులతో నిమిత్తం లేకుండా 365 రోజులు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు.

కడప నుంచి..

కడప నుంచి అహమ్మదాబాద్‌కు ప్రతి శుక్రవారం ప్రత్యేక రైలు నడుస్తోంది. 09419/09420 నంబరుతో నడిచే ఈ రైలుకు డిమాండ్ బాగానే ఉంది. అలాగే తిరుపతి నుంచి షోలాపూర్‌కు శుక్రవారం ప్రత్యేక రైలు 01437/38 నంబరుతో రద్దీగా నడుస్తోంది. అలాగే ఓఖా–రామేశ్వరం మధ్య 19519/20 నంబరు రైలు నడుస్తోంది. వీటన్నింటిని రెగ్యులర్ చేయలేదు. కొన్నేళ్లుగా ప్రత్యేక రైళ్లుగానే నడుస్తున్నాయి.

20 నుంచి 30 శాతం చార్జీలు అదనం..

ప్రత్యేక రైళ్లలో 20 నుంచి 30 శాతం వరకు చార్జీలు పెంచడం వల్ల సాధారణ ప్రయాణికులపై భారం పడుతోంది. 0 నంబరు ఉండే రైళ్లను ప్రత్యేక రైళ్లగా పరిగణిస్తున్నారు. కరోనా వ్యాప్తి తొలిదశలో అన్ని రైళ్లకు బండి నంబరుకు ముందు 0 యాడ్ చేసి ప్రత్యేక రైళ్లగా నడిపించారు.

ఇంటర్ సిటీలో రిజర్వేషన్‌కు ప్రత్యేక బాదుడు

తిరుపతి–హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణానికి ప్రత్యేక రైలుకున్న తరహాలో చార్జీలను రైల్వే వసూలు చేస్తోంది. సాధారణ బోగీలకు మాత్రం సాధారణ చార్జీలను తీసుకుంటోంది. ఇంటర్ సిటీ రైలు నంబరుకు సున్నా చేర్చడంతో ప్రత్యేక చార్జీల భారం వేశారు.

కడప నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లలో బాదుడు ఇలా..

గమ్యస్థానం	రెగ్యులర్ స్లీపర్ చార్జీ	స్పెషల్ స్లీపర్ చార్జీ
షోలాపూర్	రూ.360	రూ.605
చెన్నై	రూ.225	రూ.385
అహమ్మదాబాద్	రూ.580	రూ.705
హుబ్లీ	రూ.270	రూ.385
కొల్హాపూర్	రూ.405	రూ.520 (తత్కాల్)

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్
- సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు
- జూన్ 6 వరకు 144 సెక్షన్ అమలు
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి విజయకరామరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో నిరంతర నిఘా కెమెరాలు, ప్రత్యేక భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 13,04,256 ఓట్లతో 79.57 శాతం ఓటర్స్ టర్నవుట్ నమోదైందని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు 22,669, పార్లమెంటుకు 22,657 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలాన అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన 112 సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీకి 14 చొప్పున ఈవీఎం టేబుళ్లు, అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ర్యాండమైజేషన్

ఈనెల 25వ తేదీ కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. జూన్ 2న రెండవ ర్యాండమైజేషన్, కౌంటింగ్ రోజు ఉదయం 5.00 గంటలకు మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో జరుగుతుందని తెలిపారు. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు భరత్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), హరిప్రసాద్ (టీడీపీ), లక్ష్మణ్‌రావు (బీజేపీ), మనోహర్ (సీపీఎం), కానుగదానం (బీఎస్పీ), సుధాకర్ (కాంగ్రెస్), శ్రీనివాసులు (ఆప్), కమిషనర్ ప్రవీణ్‌చంద్ పాల్గొన్నారు.

రౌండ్ల వారీగా...

బద్వేలు నియోజకవర్గంలో 272 పోలింగ్ కేంద్రాలకుగాను 20 కౌంటింగ్ రౌండ్లు ఉంటాయన్నారు. కడపలో 287 పోలింగ్ కేంద్రాలకు 21 కౌంటింగ్ రౌండ్లు, పులివెందులలో 301 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్లు, కమలాపురంలో 251 పోలింగ్ కేంద్రాలకు 18 రౌండ్లు, జమ్మలమడుగులో 315 పోలింగ్ కేంద్రాలకు 23 రౌండ్లు, ప్రొద్దుటూరులో 268 పోలింగ్ కేంద్రాలకు 20 రౌండ్లు, మైదుకూరులో 269 పోలింగ్ కేంద్రాలకు 20 కౌంటింగ్ రౌండ్లు ఏర్పాటు చేశామని వివరించారు. కౌంటింగ్ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటల్లోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని వివరించారు. కౌటింగ్ హాలులోకి అభ్యర్థి లేదా కౌంటింగ్ ఏజెంట్ ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన షంషీర్

పోరుమామిళ్ల : పట్టణ శివారున బుధవారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోరుమామిళ్ల నుంచి షంషీర్(45) రాజాసాహెబ్‌పేట వెళ్తున్నారు. బద్వేల్ రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంకు వైపునకు స్కూటర్‌ను తిప్పగా అటు నుంచి వేగంగా వస్తున్న మరో వ్యక్తి ఢీకొన్నారు. బద్వేల్ వైపు నుండి పట్టణానికి వస్తున్న రేంజర్ రఘునాథరెడ్డి తన కారు ఆపి గాయపడిన షంషీర్‌ను బీట్ ఆఫీసర్ కరుణాకర్, డ్రైవర్ సాయంతో ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి ఉదయగిరికి చెందిన వాడు కాగా, అతడికి గాయాలవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గుండె పోటుతో నిర్వాసితుడు మృతి

కొండాపురం : గండికోట నిర్వాసితుడు వల్లపు వెంకటకొండయ్య(57) గుండె పోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కొండాపురం గ్రామానికి సంబంధించిన సప్లమెంటరీ జాబితాలోని ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ కోసం వెంకటకొండయ్యతోపాటు పదిమంది నిర్వాసితులు రెండు వాహనాల్లో కడప కలెక్టర్‌ను కలిసేందుకు బయలుదేరినట్లు నిర్వాసితులు తెలిపారు. కమలాపురం సమీపంలో వల్లపు వెంకటకొండయ్యకు ఛాతీలోనొప్పి రావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసికెళ్లినట్లు నిర్వాసితులు తెలిపారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

వీరపునాయునిపల్లె : వేధింపులు తాళలేక మనస్తాపానికి గురైన ఓ యువతి పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై వెంకటరెడ్డి కథనం మేరకు.. పోరుమామిళ్ల మండలం కల్వకుంట్లకు చెందిన క్రాంతి కిరణ్ గండి వద్ద అటవీ చెక్‌పోస్టులో పనిచేస్తున్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దుగ్గినబోయిన హర్షిత(20)ను క్రాంతికిరణ్ ప్రేమిస్తున్నాడు. అతడు నచ్చకపోవడంతో హర్షిత దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ క్రాంతికిరణ్ ఫోన్ చేసి మానసికంగా వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం.ఓబులేసు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సిద్దిక్ పేర్కొన్నారు. నగరంలోని జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ జిల్లాలో నారాయణ, చైతన్య, మరిన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి రూ.లక్షల రూపంలో ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఒక తరగతికి పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలను రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా రక రకాల పేరుతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు.

ప్రజల గుండెలలో పెద్దాయన

- వైఎస్ఆర్ రాజకీయ అభివృద్ధికి తోడ్పాటు
- సర్పంచ్‌గా పులివెందుల గ్రామాభివృద్ధికి కృషి
- నేడు దివంగత వైఎస్.రాజారెడ్డి 26వ వర్ధంతి
- నివాళులర్పించనున్న వైఎస్ కుటుంబీకులు


దివంగత వైఎస్.రాజారెడ్డి, వైఎస్.జయమ్మలు

పులివెందుల : పులివెందుల చరిత్రలో పెద్దాయనది ఒక ప్రత్యేకత. పేదలకు.. తమ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి అండగా నిలిచే వారు. కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు దివంగత వైఎస్.రాజారెడ్డి. 1925 సంవత్సరంలో వెంకటరెడ్డి, మంగమ్మ దంపతులకు వైఎస్.రాజారెడ్డి జన్మించారు. క్రమశిక్షణ గల కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ, కుమారులు, కుమార్తెలను ఉన్నత స్థానంలో నిలపడంలో ఆయన పాత్ర ఎనలేనిది.

పులివెందుల గ్రామ సర్పంచ్‌గా

రాజకీయాల్లోకి రాక మునుపు నుంచి పులివెందులలో వైఎస్.రాజారెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎలాంటి సమస్యనైనా ఆయన దగ్గరికి వెళితే పరిష్కారమవుతుందని ప్రజల నమ్మకం. ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన రాజారెడ్డి పులివెందుల సర్పంచుగా తన ప్రజాప్రస్థానం ప్రారంభించారు. 1988 నుండి 1995 వరకు ఆయన పులివెందుల సర్పంచ్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే పులివెందులలో వీధి దీపాలు, రోడ్లు, విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంతోపాటు మంచినీటి చెరువులను తవ్వించారు. ఒకవైపు అభివృద్ధి పనులు చేపడుతూనే ఆ ప్రాంత ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేవారు. అప్పట్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చినప్పుడు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి సమస్య పరిష్కరించారు. గ్రామ సమస్యలపై పోరాడుతూనే మరో వైపు తన ఆశయాల సాధనకు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తన సుపుత్రులలో ఇద్దరిని ప్రజలకు అంకితం చేశారు. రాష్ట్ర ప్రజలకు నేడు జనరంజక పాలన అందడానికి, పేదల పట్టెడు అన్నం, గూడు, బట్టలు కట్టడమే కాకుండా రైతులను అన్ని విధాలా ఆదుకున్న పెద్దాయన కుమారుడు దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కృషి ఉంది. నేటికీ అక్కడక్కడా పెద్దాయన పేరుతో సేవా కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయి. పులివెందులలో ప్రత్యేకంగా ఆయన పేరుతో కాలనీలు వెలిశాయి.

ప్రజల మనస్సులో ప్రత్యేక స్థానం

పులివెందుల ప్రాంత ప్రజల మనస్సులో వైఎస్.రాజారెడ్డి ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. ఆయన బ్రతికున్న కాలంలో ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడిన పెద్దాయన. ప్రజలు తమకు ఏ కష్టం వచ్చినా పులివెందుల పెద్దాయనగా పిలవబడే వైఎస్.రాజారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి మొరపెట్టుకునేవారు. అంతేగాక ఆయన తనయుడు దివంగత మహా నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి రాజకీయ అభివృద్ధికి వైఎస్.రాజారెడ్డి ఎంతో తోడ్పాటునందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో తలమునకలై ఉండగా.. పెద్దాయన పులివెందుల ప్రాంతంలో ప్రజల సమస్యలు, రాజకీయాలను అన్నీ తానై చూసుకొనేవాడు. వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ఆయన తపించేవాడు.

విద్యా ప్రదాతగా

దివంగత వైఎస్.రాజారెడ్డి పులివెందుల పేదల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూనే పులివెందులలో పేద విద్యార్థుల కోసం డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు నెలకొల్పాడు. ప్రజలకు సేవ చేయడంలో ఆయన ఎంతో తృప్తి పొందేవాడు. వైఎస్.రాజారెడ్డి, వైఎస్సార్‌లు చూపిన బాటలోనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు నడుస్తున్నారని చెప్పవచ్చు. ఏది ఏమైనా పులివెందుల ప్రాంత ప్రజలు ఈనాటికీ పెద్దాయనను మర్చిపోలేకపోతున్నారు.

నివాళులర్పించనున్న వైఎస్ కుటుంబసభ్యులు

నేడు దివంగత వైఎస్.రాజారెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా గురువారం పులివెందుల డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సమాధుల తోటలో వైఎస్ జయమ్మ, రాజారెడ్డి సమాధుల వద్ద వైఎస్సార్ కుటుంబీకులు నివాళులర్పించనున్నారు. అనంతరం వైఎస్.రాజారెడ్డి పార్కులోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం జీసెస్ చారిటీస్‌లో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం స్థానికంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పశు సంవర్ధక సహాయకులకు శిక్షణ


శిక్షణ పత్రాలు అందజేస్తున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో నియమించిన పశు సంవర్ధక సహాయకులు క్షేత్ర స్థాయిలో పనిచేసి రైతుల మన్ననలు పొందాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. పశుసంవర్ధక సహాయకులకు నిర్వహించిన 45 రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కడప పశుసంవర్ధక శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ముగింపు సమావేశంలో సహాయకులకు శిక్షణ పత్రాలు అందజేశారు. డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ నూతనంగా నియమించిన పశుసంవర్ధక సహాయకులకు కడప, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పులివెందులల్లో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో అమలుచేసి రైతులకు మేలు చేయాలన్నారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు వారికి పశు వైద్యశాలల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఉప సంచాలకులు టీవీ.రమరణయ్య మాట్లాడుతూ పశుసంవర్ధక సహాయకులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసి మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ రమేష్, ఏడీలు శ్రీధర్‌లింగారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఉపేంద్ర, శివరామిరెడ్డి, సురేష్, ఎర్రపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

కమలాపురం : కడప – కమలాపురం రైల్వే స్టేషన్ మధ్య పాపాఘ్ని నది రైల్వే వంతెనపై విద్యార్థి మల్లికార్జున (17) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు సమాచారం మేరకు.. పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు గ్రామానికి చెందిన మల్లికార్జున తల్లిదండ్రులు గత ఏడాది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అతడు వల్లూరు మండలం తప్పెట్లలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. బుధవారం పాపాఘ్ని నది వంతెనపై రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు.

యువకుడు బలవన్మరణం

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన బి.శివప్రసాద్‌రెడ్డి(30) బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు... శివప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

మాచుపల్లెలో రైతు సదస్సు


తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుపతి శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండంలోని మాచుపల్లె గ్రామంలో కడప ఏరువాక కేంద్రం (డ్రాప్టు సెంటర్) ఆధ్వర్యంలో బుధవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఊటుకూరులోని ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ సిద్దవటం మండలం మాచుపల్లె, శాంతినగర్, టక్కోలి, చింతకొమ్మదిన్నె మండలం తాడిగట్ల గ్రామాల ఆతిధ్య రైతుల చెంతన ఉంటూ 3 నెలల పాటు సాంకేతిక అంశాలు గమనిస్తూ ఆఖరి మజిలీలో ఈ కార్యక్రమం జరిగిందని తెలిపారు. ఇందులో విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన (సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, కిసాన్ డ్రోన్, చిరుధాన్యాలు మిద్దె తోటలు, దేశీయ సాంకేతిక పద్ధతులు) ఆకట్టుకుందన్నారు. రైతుల నుంచి తెలుసుకున్న విషయాలు విద్యార్థులు భవిష్యత్‌లో మంచి విస్తరణాధికారులు, శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడతాయన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస ఉద్యాన పంటల్లో రైతులకు మెలకువలు వివరించారు. బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ పచ్చిరొట్ట ఎరువులు, నత్రజని వినియోగం, జింక్, పొటాషియం ఎరువుల ప్రాధాన్యతను వివరించారు. డాక్టర్ ఎస్ విజయలక్ష్మి సంచాలకులు, సాంకేతిక వ్యవసాయ యాజమాన్య సంస్థ(ఆత్మ) డి.పి.డి పద్మలత, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు లక్ష్మీదేవి, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ స్వేత, తిరుపతి వ్యవసాయ కళాశాల అసిస్టెంట్లు ప్రొఫెసర్ డాక్టర్ సి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సీమ నేల గుండె చప్పుడు ‘కేతు’ కథ


కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కడప కల్చరల్: సీమ నేల నుంచి గుండెను తడిపేసే నిజాలతో కూడిన కథలను పండించి ఇక్కడి జన జీవన విధానంలో వైవిధ్యాన్ని, ఆర్తిని తెలుగు కథగా చాటిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి విలక్షణ సాహిత్య చైతన్యమూర్తి అని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వర్ధంతిని బుధవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లా రచయిత సంఘం అధ్యక్షులు, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో కథకునిగా, నవలా కారునిగా, నిరంతర సృజనశీలిగా ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ తాను పుట్టిన నేలకు తన చుట్టూ పెరిగిన సమాజానికి ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి గొంతుకగా మారి రాయలసీమ కథకు చుక్కానిగా నిలిచారని కొనియాడారు. కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ తాను చెప్పదలుచుకున్న అంశాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడం ఆచార్య కేతు ప్రత్యేకత అన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల నటుడు మధు ఆచార్య కేతు సాహితీ కృషిని వివరించారు.అంతకు ముందు కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద సాహితీవేత్తలు, అభిమానులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మూల అయ్యవారు రెడ్డి, డేవిడ్, గొబ్బూరి కోటీశ్వరరావు, విజయ్, సతీష్, బాబు, జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

అల్లరిమూకల ఆటకట్టు !

- అల్లరి మూకలను తరిమికొట్టిన పోలీసు బలగాలు
- కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లకు చెక్
- అన్నమాచార్య యూనివర్సిటీలో మాక్‌డ్రిల్


అల్లరిమూకలను తరిమికొడుతున్న పోలీసు బలగాలు

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు తలెత్తాయి... పోలీసులు తమదైన శైలిలో అల్లరి మూకల ఆటకట్టించారు... గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు... ఈ సంఘటన నిజమనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఏయూ(అన్నమాచార్య యూనివర్సిటీ)లో పోలీసు శాఖ నిర్వహించిన మాక్ డ్రిల్. ఎన్నికల కౌంటింగ్ అనంతరం అల్లర్లకు చెక్ పెట్టేందుకు ఈ ప్రక్రియ నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. అల్లర్లు జరిగే అవకాశముందని నిఘా వర్గాల హెచ్చరికతో పోలీసులు అల్లరి మూకలను ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియచెప్పేందుకు అన్నమాచార్య యూనవర్సిటీలో నిర్వహించిన మాక్ డ్రిల్ ఆద్యంతం ఆకట్టుకుంది. కౌంటింగ్ తర్వాత తలెత్తే అవాంఛనీయ సంఘటనలను ఏ విధంగా అడ్డుకోవాలో కళ్లకు కట్టినట్లు చూపారు. అల్లరి మూకలను ఏవిధంగా సంఘటనా స్థలం నుంచి తరిమికొట్టాలో ప్రదర్శించారు. విధ్వంసానికి ప్రయత్నించే వారిని అణచివేసి, పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎలా నడుచుకోవాలో తెలియచెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించడం, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం వంటి సన్నివేశాలు కట్టిపడేశాయి. తొలుత ఈ సంఘటన చూసిన విద్యార్థులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అనంతరం యాక్షన్ డ్రిల్ అని భావించి ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ చైతన్య మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు. సీఐలు నరేంద్రనాథ్, మంజునాథరెడ్డి, సి.బాబు, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


స్వామికి గంధోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

జమ్మలమడుగు : పట్టణంలోని ఆస్థానయే గౌసియాలో వెలసిన సయ్యద్‌షా పెద్దగౌస్ పీరా ఖాద్రి ఉరుసు మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి పూలతోపాటు ఫాతేహా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున వివిధ ప్రాంతాల పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక చాందినీతో అలంకరించారు. సయ్యద్‌షా తాహీర్‌పీరా ఖాద్రి, సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రి, సయ్యద్ షా భక్తియారుద్దీన్ ఖాద్రి పాల్గొన్నారు.

టూరిస్టు బస్సు సీజ్


సీజ్ చేసిన బస్సు (ఇన్‌సెట్లో) టూరిస్టులు

యశవంతపుర : విహారయాత్రకు వెళ్లిన ప్రైవేట్ బస్సును కర్ణాటకలోని గదగ్ పట్టణంలో ఆర్‌టీఓ అధికారులు సీజ్ చేశారు. వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన 49 మంది ప్రైవేటు బస్సులో కర్ణాటక, గోవా టూర్‌కు వెళ్లారు. గదగ్‌లో ఆర్‌టీఓ తనిఖీ చేసి సరైన పత్రాలు లేవంటూ బస్సును సీజ్ చేశారు. మంగళవారం రాత్రి నుంచి టూరిస్టులు ఆరుబయటే అవస్థలు పడుతున్నారు. బస్సు చాసిస్, ఇంజిన్ నంబర్‌లో తేడాలున్నట్లు అధికారులు చెప్పారు. యాత్రికులకు భాష రాక, నిద్రాహారాలు కరువై దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బస్సును ఆర్టీఓ అధికారులు ఆఫీసు ఆవరణలో ఉంచారు. యాత్రికులు అక్కడే తలదాచుకున్నారు. అక్కడ వంట చేసుకుని ఆకలి తీర్చుకున్నారు. మరో బస్సును ఏర్పాటు చేయాలని వారు బస్సు యజమానిని డిమాండ్ చేశారు.

నందబాలుడి ఆనంద విహారం



తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : పగలంతా భక్తుల మొర విని వారి సమస్యలను తీర్చిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుడు సాయంత్రం తెప్పపై జలవిహారం చేస్తూ సేద తీరాడు. దేవుని కడప ఆలయ వార్షిక తెప్పోత్సవాలో భాగంగా రెండవ రోజునా స్వామి, అమ్మవారు పుష్కరిణిలో ఐదుమార్లు విహరించారు. వేద పండితుల మంత్రోచ్చరణ, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి గీతాలాపన, మంగళ వాయిద్యాల మధ్య స్వామి, అమ్మవారి విహారం దృశ్యాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. అర్చకులు స్వామికి నివేదన అనంతరం ప్రసాదాన్ని భక్తులందరికీ పంచి పెట్టారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా / Bank of Baroda
కడప బ్రాంచ్, పోస్ట్ బాక్స్ నెం.48, సెవెన్ రోడ్స్, కడప

సవరణ

తేది.22-05-2024 న సాక్షి దినపత్రిక కడప జిల్లాలో ప్రచురితమైన మెస్సర్స్ వాసవి ఎంటర్‌ప్రైజెస్ కు సంబంధించి స్వాధీనత ప్రకటన ... తేది.18-05-2024 ... తేది.20-05-2024 ... [illegible]

తేది: 22.03.2024, ప్రదేశం: కడప — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రొద్దుటూరు ఎసిబి శాఖ(01609), సూపర్ బజార్ రోడ్డు, ప్రొద్దుటూరు, కడప జిల్లా

"సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002" లోని సెక్షన్ 13(2) క్రింద జారీ అయిన ప్రకటన

[illegible]

రుణగ్రహీత పేరు & చిరునామాలు(01)	తనఖాలో వున్న ఆస్తి (02)	బకాయి వున్న మొత్తం (03)
[illegible]	[illegible]	[illegible]

ప్రదేశం: ప్రొద్దుటూరు, తేది: 06.05.2024 — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రొద్దుటూరు ఎసిబి శాఖ

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILE
■ రన్నింగ్ కండిషన్‌లో ఉన్న 2010 మోడల్, 59 సీటింగ్ గల కాలేజీ బస్సులు అమ్మబడును. మరియు 2016 ఆ తర్వాత మోడల్ బస్సులు కొనబడును. ✆9550675010, 9912445846

REAL ESTATE
TO-LET
■ కడప నగరంలోని సింగపూర్ సిటీలో రోడ్ నెంబర్.7 నందు ఇల్లు బాడుగకు కలదు. సంప్రదించాల్సిన నెంబర్:8331951098

SERIVCES
BUSSINESS OFFER
■ పెట్టుబడి పెట్టగల 7th-PG స్త్రీ/పు మా సంస్థ నిర్వహించు సెల్‌ఫోన్ ద్వారా సర్వే వ్యాపారములో భాగస్వాములుగా చేరి నెలకి అత్యధిక సంపాదన పొందగలరు. ఫోన్: 8179021318

HEALTH CARE
■ డా.పి.దామోదరం,MD,DM(NIMS)రుమటాలజిస్ట్-కీళ్ళవాతం నిపుణులు,శుభోదయ రుమటాలజి సెంటర్,Opp. SBH Bank, జయనగర్, తిరుపతి,9391344644, 9704582045.

LOSS OF PASSPORT
■ Passport No.Y5565560 Kandula Siva Reddy S/o Muni Reddy D.No.5/25 Machpalli Village, Siddavatam Mandal, YSR District, A.P - 516002. పై వివరాలు గల పాస్‌పోర్ట్ 19/05/24 తేది సిద్దవటం నుండి ఆటోలో మా ఇంటికి వెళ్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర: 8499848371.

WANTED
■ Wanted Teachers for Maths, English, Social. Free accomidation. Cont: 8639096944, 8142660770

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500rs. మీ పేరు, కాల్ / వాట్సప్ చేయగలరు. 9502815217

■ SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్ మరియు ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆపైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు. మొబైల్ నెంబర్ : 9703868770

■ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కడప రాజంపేట్ బ్రాంచ్ నందు పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 17 వేలు+ఇన్సెంటివ్స్+TA, DA లు ఇవ్వబడును. అనుభవం కలిగిన వారికి ప్రాముఖ్యత. సెల్.9885080820

■ Travel Maniac నందు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. ప్రెషర్లకు ప్రాధాన్యత, పనితీరు మరియు నైపుణ్యంపై జీతం సంప్ర: 7288801112, 7036373886

■ కడప పాత బస్టాండ్ దగ్గర ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు 10th, ఇంటర్ చదివిన స్త్రీ/ పురుషులు (పార్ట్/ఫుల్‌టైమ్) కావలెను. సంప్ర:9390120168

■ కృష్ణపేట్ల కాడ VIP ఇళ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు ఆయా,నర్సులు,వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 8317512135

■ ప్రముఖ బ్యాంకులలో పర్మినెంట్‌గా కం॥ ఆపరేటర్స్,క్లర్క్స్,అటెండర్స్,ఆఫీస్‌అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ కా॥ Qly: 10th - డిగ్రీ .జీ॥ 28000/-. ఫోన్: 7981852556

■ ప్రముఖ కార్పొరేట్ కోటక్ మహీంద్ర బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన కోటక్ లైఫ్ ఇన్సూరెన్సు నందు పనిచేయుటకు విద్యావంతులైన యువతీ, యువకులు మరియు రిటైర్డ్ సీనియర్ సిటిజన్స్ కావలెను. 8309010889

■ హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. రూమ్+భోజనం ఫ్రీ. జీ:18,000/- to 30,000/- చదువులేకున్నా. ఫోన్: 9989980582

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించే ముందు ప్రకటనదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రకటనదారుల ద్వారా జరిగే నష్టాలకు ఈ వార్తా పత్రిక ఏ విధంగానూ బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409